ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడాలి

శ్రీకాకుళం అర్బన్ : నూతన విద్యా విధానం పేరుతో గత ప్రభుత్వం ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేసిందని ఎస్‌టియు రాష్ట్ర అధ్యక్షులు ఎల్.సాయి శ్రీనివాస్ విమర్శించారు. నగరంలోని క్రాంతి భవన్‌లో స్టేట్ టీచర్స్ యూనియన్ (ఎస్‌టియు) జిల్లా కార్యవర్గ సమావేశం జిల్లా అధ్యక్షులు రమణమూర్తి అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 117 జిఒను వెంటనే రద్దు చేసి, ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడాలన్నారు. పాఠశాలల్లో తెలుగు, ఇంగ్లీష్ మీడియంలకు సమాంతరంగా నిర్వహించి ఉపాధ్యాయులపై పనిభారం తగ్గించాలని, 30 పీరియడ్ల బోధనకు పరిమితం చేయాలన్నారు. యాప్‌ల నిర్వహణ నుంచి ఉపాధ్యాయులను మినహాయించి వాటి నిర్వహణకు డిజిటల్ అసిస్టెంట్లను నియమించాలన్నారు. మున్సిపల్ ఉపాధ్యాయుల బదిలీలు ఉద్యోగోన్నతులు చేపట్టాలని కోరారు.

వ్యాధుల విజృంభణ

- ప్రబలుతున్న డయేరియా
- వారం రోజుల్లో 67 కేసులు నమోదు
- పెరుగుతున్న మలేరియా, డెంగీ బాధితులు
- అపారిశుధ్య పరిస్థితులు, కలుషిత నీరే కారణం

వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. ముఖ్యంగా డయేరియా కేసుల సంఖ్య క్రమేణా పెరుగుతోంది. వీటితోపాటు మలేరియా, డెంగీ చుట్టుముడుతున్నాయి. వ్యాధుల బారిన పడుతున్న వారితో ప్రభుత్వ, ప్రయివేట్ ఆసుపత్రులు కిటకిటలాడుతున్నాయి. అధికారికంగా నమోదవుతున్నా కేసులు తక్కువగానే కనిపిస్తున్నా, అనధికారికంగా కేసుల సంఖ్య ఎక్కువగానే ఉంది. ప్రభుత్వాస్పత్రుల్లో వైద్యం అందుతున్నా, పరిస్థితి విషమిస్తున్న తరుణంలో ఇళ్ల నుంచి రోగులను నేరుగా ప్రయివేట్ వైద్యశాలలకు తరలిస్తున్నారు. ఇదే అదునుగా ప్రయివేట్ ఆసుపత్రులు భారీ మొత్తంలో ఫీజుల వసూళ్లకు పాల్పడుతున్నాయి. పంచాయతీలకు ప్రభుత్వం పైసా డబ్బులు విదిలించకపోవడంతో పారిశుధ్య పనులు సక్రమంగా లేక వ్యాధుల ప్రబలడానికి దారితీస్తోంది.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

కోటబొమ్మాళి సిహెచ్‌సిలో చికిత్స పొందుతున్న కెజిబివి విద్యార్థినులు (ఫైల్)

జిల్లాలో ఈ సీజన్‌లో సాధారణంగా డెంగీ, మలేరియా కేసులు నమోదయ్యే పరిస్థితి ఉండగా, ఈసారి మాత్రం డయేరియా ప్రజలను బెంబేలెత్తిస్తోంది. జూలైలో మొదటి వారం రోజుల్లోనే ఏకంగా 67 కేసులు నమోదయ్యాయంటే వ్యాధి తీవ్రత ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. వాంతులు, విరేచనాలతో ఆసుపత్రుల్లో చేరుతున్న వారి సంఖ్య ఎక్కువవుతోంది. గ్రామాల్లో పిహెచ్‌సిలు, ప్రయివేట్ క్లినిక్‌లకు డయేరియా బాధితుల తాకిడి ఎక్కువగా కనిపిస్తోంది. వ్యాధుల బారిన పడుతున్న వారిలో వసతిగృహ విద్యార్థులూ ఉన్నారు. కోటబొమ్మాళి కెజిబివి స్కూల్‌కు చెందిన 20 మంది విద్యార్థినులు ఈనెల ఏడో తేదీన వాంతులు, విరేచనాలతో అస్వస్థతకు గురై ఆసుపత్రిలో చేరారు. అంతకుముందు గత నెల 27వ తేదీన శ్రీకాకుళం నగరంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో తొమ్మిది మంది విద్యార్థులు డయేరియా బారిన పడడంతో వారికి శ్రీకాకుళం సర్వజన ఆసుపత్రిలో చికిత్స అందించారు. అతిసార సోకి మరణాలూ సంభవిస్తున్నా నమోదు కావడం లేదు. గ్రామంలో ముఖ్యమైన నాయకుడో, పేరున్న వ్యక్తి చనిపోతేనే వెలుగులోకి వస్తున్నాయి. ఆమదాలవలస మండలం వెదుళ్లవలసకు చెందిన టిడిపి నాయకుడు లక్ష్మణరావు అతిసార లక్షణాలతో బాధపడుతూ శ్రీకాకుళంలోని ఒక ప్రయివేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఈనెల ఏడో తేదీన మరణించారు.

పెరుగుతున్న డెంగీ కేసులు

జిల్లాలో రెండు నెలలుగా డెంగీ కేసులు క్రమేణా పెరుగుతున్నాయి. ప్రభుత్వాసుపత్రుల్లో నమోదైన లెక్కల ప్రకారం జూలై మొదటి వారంలోనే రెండు కేసులు వెలుగు చూశాయి. జూన్‌లో రెండు కేసులు నమోదయ్యాయి. ప్రయివేట్ ఆసుపత్రుల్లో చేరుతున్న వారు వందల్లోనే ఉన్నారు. డెంగీ లక్షణాలు ఉన్నా, లేకున్నా ఆ వ్యాధి పేరుతోనే చికిత్స చేస్తూ రోగుల నుంచి అధిక మొత్తంలో ఫీజులు వసూలు చేస్తున్నాయి. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి, టెక్కలిలోని జిల్లా కేంద్రాసుపత్రిలోనే డెంగీకి సంబంధించి ఎలీసా పరీక్షలు నిర్వహించాలని పక్కాగా ఆదేశాలు ఉన్నా... ప్రయివేట్ ఆసుపత్రులు, లేబొరేటరీల్లో అనధికారికంగా పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. జ్వరాలతో వస్తున్న వారికి కిట్ టెస్టులు నిర్వహించి డెంగీ సోకినట్లుగా బాధిత కుటుంబాలకు చెప్తున్నారు.

మలేరియా పీడితులూ ఎక్కువే

మలేరియాతో బాధపడుతున్న వారి సంఖ్య ఎక్కువగానే ఉంది. జ్వరాలతో వస్తున్న వారితో ఆస్పత్రులు, క్లినిక్‌లు రద్దీగా మారాయి. శ్రీకాకుళం సర్వజన ఆస్పత్రి, టెక్కలి జిల్లా కేంద్రాస్పత్రి, పిహెచ్‌సిల్లో మాత్రం అధికారికంగా కేసులు నమోదవుతున్నాయి. ప్రయివేట్ ఆసుపత్రుల్లో వందలాది మంది మలేరియా లక్షణాలతో చికిత్స చేయించుకుంటున్నా నమోదు కావడం లేదు. జూలైలో ఏకంగా ఐదు కేసులు నమోదయ్యాయి. సరుబుజ్జిలి మండలం వెన్నెలవలస గిరిజన బాలిక ఆశ్రమ పాఠశాలలో బిడ్డిక రస్మిత మలేరియా లక్షణాలతో ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఏడో తేదీన మరణించింది. పాఠశాలలో విద్యార్థులకు పరీక్షలు నిర్వహించగా, మరో నలుగురిలో మలేరియా లక్షణాలు కనిపించాయి.

అపారిశుధ్య పరిస్థితులూ కారణమే

గ్రామాల్లో తీవ్ర అపారిశుధ్య పరిస్థితులు నెలకొన్నాయి. వర్షాలు పడుతుండడంతో వ్యాధులు ప్రబలుతున్నాయి. డయేరియా, మలేరియా, డెంగీ తదితర వ్యాధులు, జ్వరాల బారిన పడుతున్నారు. పంచాయతీ ఖాతాల్లో డబ్బులు లేకపోవడంతో పారిశుధ్య పనులపై పెద్దగా దృష్టిసారించడం లేదు. మరోవైపు వైద్యారోగ్యశాఖ పంచాయతీ అధికారులు బావుల్లో క్లోరినేషన్ చేయడం లేదు. దోమల మందులను పిచికారీ చేయకపోవడం పరిస్థితి మరింత దారుణంగా తయారైంది. పంచాయతీల్లో పారిశుధ్య నిర్వహణపై జిల్లాస్థాయిలో కనీసం సమీక్షా సమావేశాలూ నిర్వహించడం లేదు. వసతిగృహాల్లో పారిశుధ్య పరిస్థితులు అధ్వానంగా ఉన్నాయి. నీటిని కాచి వడపోసి తాగాలని వైద్యారోగ్యశాఖ అధికారులు చెప్తున్నా వసతిగృహాలకు ఆ సౌకర్యం లేదు. కనీసం రక్షిత మంచినీటినీ అందించే పని సంక్షేమశాఖ అధికారులు చేయలేకపోతున్నారు. దాని ఫలితమే కోటబొమ్మాళి కెజిబివి విద్యార్థినులు వాంతులు, విరేచనాలతో అస్వస్థతకు గురయ్యారు.

వ్యాధుల నియంత్రణకు చర్యలు

జిల్లాలో ప్రబలుతున్న డయేరియా, డెంగీ, మలేరియా వ్యాధుల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టాం. స్టాప్ డయేరియా కార్యక్రమం ద్వారా అతిసార వ్యాప్తిపై ప్రజల్లో అవగాహన కల్పించాం. ప్రతి శుక్రవారం డ్రై డే అమలు జరిగేలా చూస్తున్నాం. జనావాసాల్లో దోమల మందులను పిచికారీ చేయాలని సిబ్బందికి సూచించాం. అన్ని పిహెచ్‌సిల్లో అవసరమైన మందులు అందుబాటులో ఉంచాం.

- బొడ్డేపల్లి మీనాక్షి, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి

జీడికి మద్దతు ధర కల్పించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు

ప్రజాశక్తి - సోంపేట

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి గోవిందరావు

రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకొని 80 కేజీల జీడిపిక్కల బస్తాకు రూ.16 వేలు మద్దతు ధర ప్రకటించి, రైతుభరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె.మోహనరావు, జిల్లా కమిటీ సభ్యులు కె.నాగమణి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక గానుగుల తరుణాచారి స్మారక విజ్ఞాన కేంద్రంలో మండల కన్వీనర్ సంగారు లక్ష్మీనారాయణ అధ్యక్షతన సోమవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. జీడి పంటకు గిట్టుబాటు ధర లేకపోవడం వల్ల రైతులు తీవ్ర దోపిడీకి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జీడిపప్పు ధర ఆకాశాన్ని అంటుతుంటే జీడిపిక్క ధర పాతాళంలో ఉందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం జీడి రైతులకు గిట్టుబాటు ధర ఎందుకు ప్రకటించడం లేదని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం జీడి రైతులకు ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాన్ని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

కేరళ తరహాలో జీడి బోర్డులు ఏర్పాటు చేయాలని, స్థానిక జీడిపిక్కలు కొనుగోలు చేసిన తర్వాతనే విదేశీ జీడిపిక్కలను అనుమతించాలన్నారు. పైడిగాం ఛానల్, బారువా గ్రోయన్, పొత్తంగి గ్రోయన్, సునామిది ఛానల్ మరమ్మతులు చేసి సాగునీరందించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మండల నాయకులు పాతిన కృష్ణమూర్తి, జె.సింహాచలం, తెప్పల పాపారావు, కె.సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

'మీకోసం'కు 235 వినతులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

నగరంలోని జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన 'మీకోసం'కు జిల్లావ్యాప్తంగా పలు సమస్యలపై 235 వినతులు వచ్చాయి. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, ప్రత్యేక ఉప కలెక్టర్ రామ్మోహన్‌రావు వినతులు స్వీకరించారు. 60 శాతం వైకల్యం ఉన్న తనకు 2009 నుంచి ఇస్తున్న వికలాంగ పింఛన్‌ను ఈ ఏడాది ఫిబ్రవరిలో నిలుపుదల చేశారని, దాన్ని పునరుద్ధరించాలని నగరంలోని హౌసింగ్ బోర్డు ప్రాంతానికి చెందిన రేణుక వినతిపత్రం అందజేశారు. తన భూమిని ఎల్ఎన్‌పేట మండలం గార్లపాడుకు చెందిన గేదెల రమేష్ నాయుడు ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని, భూములు అన్యాక్రాంతం కాకుండా సంరక్షించాలని కోరుతూ హిరమండలం మండలంలోని పుట్టిగం గిరిజన గ్రామానికి చెందిన ఆరిక అమరావతి ఫిర్యాదు చేశారు. గార మండలం అంపోలుకు చెందిన చిట్టి శేఖర్ తన భూమి రికార్డుల్లో లోపాలను సరిదిద్దాలని వినతిపత్రం అందజేశారు. అదే మండలం బందరువానిపేటకు చెందిన వికలాంగుడు గనగళ్ల ఈశ్వరరావు తనకు మూడు చక్రాల వాహనం ఇప్పించాలని దరఖాస్తు అందజేశాడు. జి.సిగడాం మండలం నడిమివలసకు చెందిన ఆర్.కళావతి తన తండ్రి ద్వారా సంక్రమించిన 0.98 సెంట్ల భూమి గిఫ్ట్ రిజిస్ట్రేషన్ పొందినట్టు తెలిపారు. ఆ భూమికి మ్యుటేషన్ కోసం దరఖాస్తు చేసుకోగా విఆర్‌ఒ తిరస్కరించారని, ఆ భూమిని తన పేరున మ్యుటేషన్ చేయాలని కోరారు. సారవకోట మండలం బెజ్జి గ్రామానికి 1983లో రహదారి నిర్మాణానికి ప్రభుత్వం రైతుల నుంచి భూములను సేకరించినా, నేటికీ నష్ట పరిహారం చెల్లించలేదని ఆ గ్రామానికి చెందిన పర్లి అప్పారావు ఫిర్యాదు చేశారు. తన భూమిని స్థానికులు ఆక్రమించుకున్నారని, తన భూమిని ఇప్పించాలని జలుమూరు మండలానికి చెందిన 90 ఏళ్ల జయలక్ష్మి కోరారు. దీనిపై స్పందించిన కలెక్టర్ నివేదిక ఇవ్వాలని ఆదేశించారు.

వినతులు సకాలంలో పరిష్కరించాలి

ప్రజల నుంచి స్వీకరిస్తున్న ప్రతి వినతినీ సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. పరిష్కరించిన వాటిని పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో రెవెన్యూ శాఖ నుంచి ఎక్కువ ఫిర్యాదులు అందుతున్నాయని, వాటిని తహశీల్దార్లు ప్రత్యేక శ్రద్ధతో పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో కె.ఆర్.సి ప్రత్యేక ఉప కలెక్టర్ సుదర్శనదొర, జెడ్‌పి సిఇఒ వెంకటేశ్వరరావు, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బి.మీనాక్షి, డ్వామా పీడీ జి.వి చిట్టిరాజు, డిసిహెచ్ఎస్ రాజ్యలక్ష్మి, ఇరిగేషన్ ఎస్ఇ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక కోసం బారులు

ప్రజాశక్తి - టెక్కలి

ఉచిత ఇసుక విధానం సోమవారం నుంచి అమలు కావడంతో ఉదయం ఆరు గంటల నుంచే ట్రాక్టర్లు బారులు తీరాయి. టెక్కలిలోని ఆర్‌టిసి డిపో వద్ద గతంలో నిల్వ చేసిన పది వేల మెట్రిక్ టన్నుల ఇసుక విక్రయాలకు అధికారులు అనుమతించారు. ఉచిత ఇసుక విక్రయాలకు సంబంధించిన జిఒ సోమవారం మధ్యాహ్నం విడుదల కావడంతో సాయంత్రం వరకు విక్రయాలు చేపట్టలేదు. దీంతో అధికారులు, ట్రాక్టర్ డ్రైవర్లు నిరీక్షించారు. ఆర్‌టిసి డిపో నుంచి తొలుసూరుపల్లి రోడ్డు వరకు ట్రాక్టర్లు బారులు తీరి ఉన్నాయి.

రూ.1.75 లక్షల కోట్ల ఇసుక దోపిడీ

ఎమ్మెల్యే కూన రవికుమార్

శ్రీకాకుళం అర్బన్ : ఐదేళ్ల వైసిపి పాలనలో ఒక్క ఇసుక తవ్వకాల్లోనే సుమారు రూ.1.75 లక్షల కోట్ల దోపిడీ జరిగిందని ఎమ్మెల్యే కూన రవికుమార్ ఆరోపించారు. ప్రభుత్వ ఖజానాకు మాత్రం కేవలం రూ.700 కోట్లు మాత్రమే కట్టారని చెప్పారు. నగరంలోని టిడిపి జిల్లా కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికల్లో ఇచ్చిన ఉచిత ఇసుక హామీని అమలు చేసి కొత్త అధ్యాయానికి తెరలేపారన్నారు. ఐదు రకాల ఛార్జీలను రద్దు చేసి కేవలం లోడింగ్, రవాణా ఛార్జీలతో ఉచితంగా ఇసుకను ప్రభుత్వం ఇస్తోందని తెలిపారు. ఇసుకను యథేచ్ఛగా దోపిడీ చేసి మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి దోచుకున్నారని ఆరోపించారు. ఎస్ఇబి అనే కొత్త వ్యవస్థను పెట్టి ఎర్రచందనం, మెన్స్, వైన్, ఇసుక దోపిడీకి పాల్పడ్డారని ధ్వజమెత్తారు. ఇసుక దోపిడీపై విచారణ చేసి జగన్ దోచుకున్న డబ్బులను ప్రభుత్వపరం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబును కోరుతానన్నారు.

రైతుబజారులో రాయితీపై కందిపప్పు

శ్రీకాకుళం అర్బన్ : సామాన్యులకు ఊరటనిచ్చేలా కందిపప్పును రాయితీపై కేజీ రూ.160కు అందిస్తున్నామని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే గొండు శంకర్ కోరారు. నగరంలోని రైతుబజారులో సబ్సిడీ కందిపప్పు విక్రయ కేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ నిత్యావసర ధరల పెరుగుదల వల్ల ఇబ్బందులు పడుతున్న సామాన్య ప్రజలకు ఊరటనిచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. బహిరంగ మార్కెట్‌లో కిలో రూ.200 పైగా ఉన్న కందిపప్పును రాయితీపై రూ.160కు అందిస్తున్నట్లు తెలిపారు. ఇందుకు గానూ పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యాన రైతుబజారులో రెండు ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. నిత్యావసరాల ధరల నియంత్రణకు కమిటీలు వేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో పౌరసరఫరాల శాఖ అధికారి బి.శాంతిశ్రీ, పౌరసరఫరాల సంస్థ మేనేజర్ శ్రీనివాసరావు, రైతుబజారు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు నిలుపుదల చేయొద్దు

జెడ్‌పి ఎదుట కూలీల ధర్నా

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ధర్నా చేస్తున్న ఉపాధి హామీ కూలీలు

జిల్లాలో ఉపాధి హామీ పనులు నిలుపుదల చేయొద్దని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గంగరాపు సింహాచలం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పనులు కొనసాగించాలని కోరుతూ ఆ సంఘం ఆధ్వర్యాన ఉపాధి హామీ కూలీలు జిల్లాపరిషత్ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టాన్ని అనుసరించి, అడిగిన ప్రతి ఒక్కరికీ పని కల్పించాలన్నారు. జిల్లాలో ఎనిమిది వారాలుగా పనులు చేసిన ఉపాధి కూలీలకు డబ్బులు చెల్లించలేదని చెప్పారు. పెండింగ్‌లో ఉన్న బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఫీల్డ్ అసిస్టెంట్లు, ఉపాధి సిబ్బంది పైన రాజకీయ కక్షసాధింపు చర్యలు ఆపాలన్నారు. జిల్లా ఉపాధ్యక్షులు జి.ఈశ్వరమ్మ మాట్లాడుతూ అధికార పార్టీ నాయకుల ఒత్తిడి మేరకు ఫీల్డ్ అసిస్టెంట్లు ఉపాధి పనులు నిలుపుదల చేస్తున్నారని చెప్పారు. దీనివల్ల కూలీలు ఉపాధి కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా అధికారులకు దీనిపై పలుమార్లు ఫిర్యాదు చేసినా సమస్య పరిష్కారం కాలేదన్నారు. ఉన్నతాధికారుల అనుమతి లేకుండా ఉపాధి పనులు నిలుపుదల చేసిన వారిపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వంద రోజుల పని కల్పించలేని స్థితిలో ఉందని విమర్శించారు. బకాయిలు చెల్లించకపోవడం వల్ల కూలీలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ధర్నా అనంతరం మీకోసంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు దాసరి లక్ష్మీనారాయణ, సిర్ల మంగమ్మ, పెయ్యల రామేశ్వరి, కె.రాములమ్మ, ఆదిలక్ష్మి, గురయ్య తదితరులు పాల్గొన్నారు.

పూరీ రథయాత్రకు ప్రత్యేక బస్సులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

పోస్టర్లను ఆవిష్కరిస్తున్న విజయ్‌కుమార్ తదితరులు

శ్రీకాకుళం నుంచి ఒడిశా రాష్ట్రంలో రథయాత్ర జరిగే పూరీకి ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి ఎ.విజయ్‌కుమార్ తెలిపారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లు, బ్యానర్లను ఆర్‌టిసి కాంప్లెక్స్ ఆవరణలో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 13న రాత్రి ఎనిమిది గంటలకు శ్రీకాకుళం బస్టాండ్ నుంచి ప్రత్యేక బస్సు బయలుదేరి 14వ తేదీ ఉదయం ఐదు గంటలకు పూరీ చేరుకుంటుందని చెప్పారు. జగన్నాథ స్వామిని దర్శన అనంతరం మధ్యాహ్నం రెండు గంటలకు పూరీలో బయలుదేరి 3.30 గంటలకు కోణార్క్ సూర్య దేవాలయం తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. అక్కడ్నుంచి సాయంత్రం ఆరు గంటలకు బయలుదేరి 15న ఉదయం ఆరు గంటలకు శ్రీకాకుళం చేరుకుంటుందని వివరించారు. ఈ యాత్రకు సంబంధించి ఒకరికి రూ.2,200 టిక్కెట్ ధర నిర్ణయించడమైందన్నారు. www.apsrtconline.in ఆన్‌లైన్‌లో టిక్కెట్లు బుక్ చేసుకునే సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 7382921647, 9959225608, 9959225609, 7382917289 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు. శ్రీకాకుళం ఒకటి, రెండు డిపోల మేనేజర్లు పి.బి మల్లికార్జునరాజు, కె.రవిశంకరశర్మ, అసిస్టెంట్ మేనేజర్ వి.రమేష్, ట్రాఫిక్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

జెవై స్కూల్‌లో పుస్తకాల గది సీజ్

ప్రజాశక్తి - శ్రీకాకుళం

శ్రీకాకుళం నగరంలోని జెవై పాఠశాలలో నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాలు విక్రయిస్తున్న గదిని ఎంఇఒ కృష్ణ సోమవారం సీజ్ చేశారు. పాఠశాలలో పుస్తకాలను విక్రయిస్తున్నారన్న ఎస్ఎఫ్ఐ ఫిర్యాదు మేరకు స్పందించిన ఆయన తనిఖీ చేయగా, విక్రయాలకు ఉంచిన పుస్తకాలను గుర్తించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డి.చందు, బి.హరీష్, జిల్లా సహాయ కార్యదర్శి ఎం.సంతోష్ మాట్లాడుతూ విద్యాహక్కు చట్టం ప్రకారం పాఠశాల, కళాశాలల్లో పుస్తకాలు, యూనిఫారాలు విక్రయించడం నేరమన్నారు. జిల్లాలో కార్పొరేట్, ప్రైవేటు విద్యాసంస్థలు విద్యాహక్కు చట్టాన్ని ఉల్లంఘిస్తూ ఇష్టానుసారంగా పుస్తకాలు, యూనిఫారాల పేరిట విద్యార్థుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తూ తల్లిదండ్రులను పీల్చి పిప్పి చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అటువంటి విద్యాసంస్థలపై ఉక్కుపాదం మోపి విద్యార్థులు, తల్లిదండ్రులకు న్యాయం కోసం ఎస్ఎఫ్ఐ నిరంతరం పోరాడుతుందని తెలిపారు. ఇప్పటికే చాలా విద్యాసంస్థలు పుస్తకాలు విక్రయిస్తున్నా విద్యాశాఖ అధికారులు సరిగ్గా పట్టించుకోవడం లేదని విమర్శించారు. అదేదో మామూలు విషయంగా భావిస్తున్నారు తప్ప వాటిని నియంత్రించాలనే భావనలో లేరని చెప్పారు.

లైంగిక వేధింపుల నియంత్రణకు అంతర్గత ఫిర్యాదుల కమిటీ

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ప్రతి కార్యాలయంలో మహిళలపై లైంగిక వేధింపులను అరికట్టేందుకు అంతర్గత ఫిర్యాదుల కమిటీ ఏర్పాటు చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన అధికారుల సమీక్షలో ఆయన మాట్లాడారు. 2013లో ప్రవేశపెట్టిన పని ప్రదేశాల్లో లైంగిక వేధింపుల చట్టం (నివారణ, నిషేధం, దిద్దుబాటు)ను పటిష్టంగా అమలు చేయాల్సిన బాధ్యత ఆయా శాఖల ఉన్నతాధికారులపై ఉందన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు అన్న తేడా లేకుండా కనీసం పది మంది ఉద్యోగులున్న ప్రతి కార్యాలయంలో కమిటీని ఏర్పాటు చేసి, అందుకు సంబంధించిన వివరాలు ఐసిడిఎస్ కార్యాలయానికి పంపాలన్నారు. సచివాలయాల్లోనూ ఈ కమిటీని ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జిల్లాస్థాయిలో ఒక కమిటీ (ఎల్‌సిసి) పనిచేస్తుందని, పది మంది కంటే తక్కువ మంది పనిచేసే సంస్థలు, కార్యాలయాల ఉద్యోగులు ఈ కమిటీని సంప్రదించవచ్చని తెలిపారు.

ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.శాంతిశ్రీ చట్టం గురించి పూర్తిస్థాయిలో వివరించారు. కమిటీ ఆవశ్యకతను తెలియజేశారు. జిల్లాలో ఇప్పటివరకు పలు శాఖలకు సంబంధించి 247 అంతర్గత కమిటీలను ఏర్పాటు చేశామని చెప్పారు. జిల్లా, మండల, గ్రామస్థాయిలో గల అన్ని ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్, అన్ ఎయిడెడ్ సంస్థల్లో ఈ కమిటీలు పనిచేస్తున్నాయని తెలిపారు. అంతర్గత ఫిర్యాదుల కమిటీని ఏర్పాటు చేయలేని సంస్థలు, కార్యాలయాల్లో పనిచేసే మహిళలు తమ ఫిర్యాదుల కోసం ఉమెన్ హెల్ప్‌లైన్ 181, 9110793708 నంబరుకు ఫోన్ చేయడం ద్వారా, 1098 చైల్డ్ హెల్ప్‌లైన్ సేవలను వినియోగించుకోవచ్చని చెప్పారు. ప్రతి సంస్థ అంతర్గత కమిటీలోని సభ్యుల పేర్లు, ఫోన్ నంబర్లను ఆఫీసులో అందరికీ కనిపించేలా బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు.

ఫ్రైడే.. డ్రై డేగా పాటించాలి

వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవాలని, ప్రతి శుక్రవారం విధిగా డ్రై డేగా పాటించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీల్లో శుక్రవారంతో పాటు ప్రతి మంగళవారం తమ కార్యాలయం, సంస్థల పరిధిలో పారిశుధ్య నిర్వహణకు పెద్దపీట వేయాలని పిలుపునిచ్చారు. మంగళ, శుక్రవారాల్లో నిర్వహించాల్సిన పనులపై ప్రచారం నిర్వహించాలని సూచించారు. ఆరోగ్యకర సమాజ నిర్మాణానికి ప్రతిఒక్కరూ తమవంతు బాధ్యతగా ప్రభుత్వ సూచనలు, సలహాలు పాటించాలని కోరారు. జిల్లాలోని కస్తూరిబా పాఠశాలలు, ప్రభుత్వ వసతిగృహాల్లో పారిశుధ్యం పర్యవేక్షించేందుకు ఆయా ఎంపిడిఒలు, ప్రత్యేక అధికారులను నియమించాలని ఆదేశించారు. కాలువలను రోజూ శుభ్రం చేయాలని, ఎక్కడా చెత్త కనిపించకూడదని, ఎప్పటికప్పుడు చెత్తను డంపింగ్ యార్డుకు తరలించాలన్నారు.

IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL CIVIL JUDGE (SENIOR DIVISION) AT SRIKAKULAM SOP. 06/2024

Between

1.Ramakrishna Panda, S/o Late Maheswara Panda, Hindu aged about 70 years, R/o.Door No.1-782, Devarasetti veedhi, Hiramandalam village and mandal, Srikakulam district, Aadhaar No.560620336189.

2.Ramesh Panda, S/o. Ramakrishna Panda, Hindu aged about 46 years, R/o.Door No.1-782, Devarasetti veedhi, Hiramandalam village and mandal, Srikakulam district, Aadhaar No.456396152213.

3.Prameela Kumari Panda, D/o. Ramakrishna Panda, Hindu aged about 42 years, permanent resident of Door No.1-782, Devarasetti veedhi, Hiramandalam village and mandal, Srikakulam district, Aadhaar No.813951116681.

4. Anitakumari Panda @ Anita Chowdhury, W/o.Gopinath Chowdhury, D/o.Ramakrishna Panda, Hindu aged about 39 years, permanent resident of Door No.1-782, Devarasetti veedhi, Hiramandalam village and mandal, Srikakulam district, now residing at Door No. B-37/6, lab quarters, Kanchanbagh, Hyderabad, Andhra Pradesh - 500058

...Petitioners

And: **NIL** ...Respondent

జనరల్ నోటీసు

పై నెంబరు గల పిటిషన్ లో పిటిషనర్స్ సక్షషన్ సర్టిఫికెట్ కొరకు పై కోర్టులో పిటిషన్ దాఖలు చేసినందున సదరు పిటీషన్ లో ఎవరికైన ఎట్టి అభ్యంతరములున్నచో **తే॥ 26-7-2024 ఉ 10:30 ని॥ లకు** పైన తెలిపిన కోర్టు యందు మీరు స్వయంగా గాని, వకీలు ద్వారా గాని హాజరై తెలియజేయవలెను లేనియడల మీ పరోక్షమందు తీర్మానించబడును.

// BY COURT ORDER //

డి.టి. మణి చందన్
అడ్వకేట్,
శ్రీకాకుళం, సెల్: 8919146438.

ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్‌పి రాధిక

బాధితులకు న్యాయం చేయాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం

ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా స్వీకరించిన ఫిర్యాదులను చట్ట పరిధిలో పరిష్కారం చూపి బాధితులకు న్యాయం చేయాలని జిల్లా ఎస్‌పి జి.ఆర్.రాధిక పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆమె ప్రజల నుంచి 37 ఫిర్యాదులు స్వీకరించి, వారితో ముఖాముఖి మాట్లాడారు. ఫిర్యాదుదారుల సమస్యలు తెలుసుకొని పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామన్నారు. ఫిర్యాదుదారుల అర్జీలు, వారి వివరాలు సంబంధిత అధికారులకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తెలియజేసి చట్టప్రకారం చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. ఫిర్యాదులపై తీసుకున్న చర్యలను ఎప్పటికప్పుడు జిల్లా కార్యాలయానికి నివేదిక ద్వారా పంపాలన్నారు. మోసపూరితమైనవి 8, మిస్సింగ్ కేసు 1, కుటుంబ తగాదాలపై 6, సివిల్ సంబంధిత అంశాలపై 5, పాతవి, ఇతరత్రా అంశాలపై 17 ఫిర్యాదులు అందినట్టు తెలిపారు. ఈమెతో పాటు అదనపు ఎస్‌పి ప్రేమ కాజల్ బాధితుల వద్ద నుంచి ఫిర్యాదులు స్వీకరించారు.

వినతిపత్రం అందజేస్తున్న టిడిపి నాయకులు

కేంద్రమంత్రి దృష్టికి రైల్వేస్టేషన్ సమస్యలు

ప్రజాశక్తి- కంచిలి

మండల కేంద్రంలోని కంచిలి రైల్వే స్టేషన్‌లో నెలకొన్న సమస్యలను కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు దృష్టికి మండల టిడిపి నాయకులు తీసుకెళ్లారు. శ్రీకాకుళంలోని ఆయన కార్యాలయానికి సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. రైల్వేస్టేషన్‌లో కోచుల గుర్తింపునకు డిజిటల్ బోర్డులు ఏర్పాటు, పలు ఎక్స్‌ప్రెస్‌లు రైలు నిలుపుదల గురించి కేంద్ర మంత్రికి వివరించారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించినట్లు టిడిపి నాయకులు తెలిపారు. కార్యక్రమంలో మాదిన రామారావు, మాదిన ప్రదీప్, పి.సూర్య నారాయణరెడ్డి, జి.మన్మథరావు, పిలక చిన్నబాబు పాల్గొన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న ఆర్‌డిఒ భరత్ నాయక్

మౌలిక సదుపాయాలు కల్పిస్తాం

ఆర్‌డిఒ భరత్ నాయక్

ప్రజాశక్తి- పలాస

ఆఫ్‌షోర్ రిజర్వాయరు నిర్వాసితుల కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆర్‌డిఒ భరత్ నాయక్ అధికారులను ఆదేశించారు. మండలంలోని రామకృష్ణాపురం, గోపివల్లభపురం గ్రామాల్లో ఆర్‌అండ్‌ఆర్ కాలనీలను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో రోడ్లు, వీధి దీపాలు, తాగునీరు తదితర మౌలిక సదుపాయాలను కల్పించాలన్నారు. నిర్వాసితుల కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఇచ్చిన ఫిర్యాదు మేరకు పరిశీలించామన్నారు. ఆయనతో తహశీల్దార్ ఎస్.ఎస్.వి.ఎస్.నాయుడు, ఎంపిడిఒ మెట్ట వైకుంఠరావు, ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ దుర్యోధన, ఆర్‌అండ్‌బి ఎఇ విక్రం, పంచాయతీరాజ్ ఎఇ పార్వతి, విద్యుత్ శాఖాధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఢిల్లీరావు

శివారు భూములకు సాగునీరు

ప్రజాశక్తి- పలాస

మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు వంశధార శివారు భూములకు సాగునీరు అందించడంలో విఫలం చెందారని, ఎమ్మెల్యే గౌతు శిరీష ఎమ్మెల్యే పదవి చేపట్టి నెల రోజులు గడవక ముందే శివారు భూములకు సాగునీరు అందించారని బొడ్డపాడు పంచాయతీ ఇన్‌చార్జి, తెలుగు యువత మండల అధ్యక్షుడు కిక్కర ఢిల్లీరావు అన్నారు. మండలంలోని బొడ్డపాడులో సోమవారం విలేకరులతో మాట్లాడారు. శిరీష ఎన్నిక ముందు ఇచ్చిన హామీలో భాగంగా వంశధార సాగునీరు ఖరీఫ్ ముందే శివారు భూములకు సాగునీరు అందించడం గొప్ప విషయమన్నారు. సాగునీరు అందించాలని మాజీ మంత్రి వద్ద మొరపెట్టుకున్నా పట్టించుకోలేదన్నారు. శివారు భూములకు సాగునీరు అందించేందుకు కృషి చేసిన కేంద్ర, రాష్ట్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్ నాయుడు, కింజరాపు అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే గౌతు శిరీషకు రైతులు తరుపున ధన్యవాదాలు తెలిపారు. సమావేశంలో టిడిపి నాయకులు బి.దుష్యంత్, సార్ జోగారావు, పి.తాతారావు, బి.మోహన్, ఎన్.గంగయ్య, రాజాం జానకిరావు, పి.మోహన్, బి.కాంతారావు, రెయ్యి పాపారావు పాల్గొన్నారు.

న్యాయం జరిగే వరకు పోరాడుతాం

కవిటి: తమకు శాశ్వత తరగతి ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేసి, తమ బిడ్డలకు న్యాయం జరిగే వరకూ పోరాటం కొనసాగిస్తామని బెంతు ఒరియా ప్రతినిధులు రజనీకుమార్ దొళై, సుమన్ బిసాయి అన్నారు. తమ సమస్యల పరిష్కారానికి బెంతు ఒరియాలు చేస్తున్న రిలే నిరాహారదీక్షలు సోమవారానికి 195వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమకు తరగతి ధ్రువీకరణ పత్రాలు లేకపోవడంతో విద్యార్థులు, నిరుద్యోగులు తమ విలువైన అవకాశాలు కోల్పోయి వెనుకబాటుకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా అన్ని రంగాల్లో వెనుకబడిన బెంతు ఒరియా మహిళలు చాలా వరకు ప్రభుత్వ పథకాలకు దూరమవుతున్నారని, కొత్త ప్రభుత్వమైన తమకు న్యాయం చేయాలని కోరారు.

దీక్ష చేస్తున్న బెంతు ఒరియాలు

చిరస్మరణీయుడు వైఎస్ఆర్

పలాస : వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న అప్పలరాజు

మెళియాపుట్టి: విగ్రహానికి పూలమాలలు వేస్తున్న రెడ్డి శాంతి

సంతబొమ్మాళి : విగ్రహానికి పూలమాలలు వేస్తున్న జగన్నాయకులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి చిరస్మరణీయుడని, రాజకీయాల్లో చెరగని ముద్ర వేసుకున్న నాయకుడని, ఆయన నిజమైన వారసుడు వైఎస్ జగన్మోహనరెడ్డి మాత్రమేనని వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. జిల్లా పార్టీ కార్యాలయంలో సోమవారం వైఎస్ఆర్ జయంతి ఘనంగా నిర్వహించారు. కేకు కట్ చేసి కార్యకర్తలకు పంచి పెట్టారు. పార్టీ కార్యాలయం నుంచి ఏడురోడ్ల కూడలి వరకు పాదయాత్ర చేపట్టి ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్ఆర్ ఆశయాలను సాధించడానికి ప్రతి కార్యకర్త సమిష్టిగా కృషి చేయాలన్నారు. పార్టీకి పూర్వ వైభవాన్ని తీసుకొచ్చేందుకు శ్రమించాలన్నారు. రాష్ట్రంలో టిడిపి ప్రభుత్వం అరాచక పాలన సాగిస్తోందని, సిఎం నుంచి సాధారణ కార్యకర్త వరకు హింస ప్రవృతిని ఎంచుకొని పాలన చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్, మాజీ మున్సిపల్ చైర్మన్ మెంటాడ పద్మావతి, కళింగ కోమటి కార్పొరేషన్ మాజీ చైర్మన్ అందవరపు సూరిబాబు, డిసిసిబి మాజీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఆధ్వర్యాన

ఇందిరా విజ్ఞాన్ భవన్‌లో మాజీ సిఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో డిసిసి అధ్యక్షులు డాక్టర్ పేడాడ పరమేశ్వరరావు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు దేశెట్టి గోవింద, మల్లిబాబు, రెల్ల సురేష్, చింతాడ దిలీప్, కొర్రాయి ప్రసాద్ పాల్గొన్నారు.

ఆమదాలవలస: వైఎస్ఆర్ జయంతి సందర్భంగా ఫ్లైఓవర్ దిగువున ఉన్న వైఎస్ఆర్ విగ్రహానికి మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లర్పించారు. అనంతరం కేకును కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు కోట గోవిందరావు, చింతాడ రవికుమార్, బొడ్డేపల్లి నారాయణరావు, సురవరపు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వైఎస్ఆర్ చిత్రపటానికి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు లఖినేని సాయిరాం, రాష్ట్ర ఎస్‌సి సెల్ ప్రధాన కార్యదర్శి బొత్స వెంకటరమణ, నాయకులు సనపల వాసుదేవరావు, జి.అప్పారావు, పూజారి త్రినాధరావు, పప్పల అప్పారావు, అబ్దుల్ తదితరులు పాల్గొన్నారు.

రణస్థలం: మండల కేంద్రంలో దివంగత సిఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహనికి మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కేకును కట్ చేసారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి పిన్నింటి సాయికుమార్, ఎచ్చెర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రతినిధి లంకలపల్లి ప్రసాద్, జెడ్‌పిటిసి టొంపల సీతారాం, మండల పార్టీ అధ్యక్షులు మహంతి పెద్దరాము నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఎచ్చెర్ల: ఎచ్చెర్ల బైపాస్ జంక్షన్‌లో దివంగత సిఎం డాక్టర్ వైయస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహనికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. పేదలకు, ఆటో డ్రైవర్లకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బూర్జ: వైఎస్ఆర్ జయంతి సందర్భంగా మండలంలోని మదనాపురం జంక్షన్ వద్ద ఉన్న వైఎస్ఆర్ విగ్రహానికి వైసిపి నాయకులు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి రామారావు, ఎంపిపి ప్రతినిధి నాగేశ్వరరావు, వైసిపి మండల అధ్యక్షుడు కె.గోవిందరావు, జల్లు బలరాంనాయుడు, కార్యకర్తలు పాల్గొన్నారు.

లావేరు: లావేరు, వెంకటాపురం, అదపాక గ్రామాల్లో వైఎస్ఆర్ విగ్రహాలకు వైసిపి నాయకులు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. వైఎస్ఆర్ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో లావేరు మండల అధ్యక్షుడు దన్నాన రాజనాయుడు, ఎంపిపి ప్రతినిధి రొక్కం బాలకృష్ణ, జెడ్‌పిటిసి మీసాల సీతంనాయుడు, బురాడ చిన్నారావు, శ్రీనువాసురావు, ఎల్లం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పొందూరు: స్థానిక అంబేడ్కర్ కూడలిలో వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో మాజీ పిఎసిఎస్ అధ్యక్షులు కొంచాడ రమణమూర్తి, మాజీ ఎఎంసి చైర్మన్ బాడాన సునీల్‌కుమార్, వైసిపి నాయకులు గోవిందరావు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : స్థానిక బస్టాండ్ వద, లొద్దపుట్టి వద్ద వైఎస్ఆర్ విగ్రహాలకు జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావులు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. అనంతరం స్థానిక ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు పళ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పి.రాజ్యలక్ష్మి, వైస్ చైర్‌పర్సన్లు భారతీ దివ్య, లాభాల స్వర్ణమణి, ఎంపిపి బోర పుష్ప, జెడ్‌పిటిసి ఉప్పాడ నారాయణమ్మ, నరేంద్ర యాదవ్, శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, ప్రకాశరావు పట్నాయక్, రాజశేఖరరెడ్డి పాల్గొన్నారు.

అలాగే షర్మిల పాదయాత్ర విజయ స్థూపం వద్ద వైఎస్ఆర్ విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కో-ఆర్డినేటర్ అలీంఖాన్ గోపి, చిన్న, మురళి, జోగారావు, వెంకటరావు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. అనంతరం పేదలకు రొట్టెలు, పళ్లు పంపిణీ చేశారు.

కవిటి: మండలంలోని కవిటి, కొత్తపుట్టుగలో ఉన్న వైఎస్ఆర్ విగ్రహాలకు ఎమ్మెల్సీ నర్తు రామారావు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి కడియాల ప్రకాష్, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు పూడి లక్ష్మణరావు, సీడాప్ మాజీ చైర్మన్ శ్యాడిశ్యామ్‌ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

సోంపేట : స్థానిక బస్టాండ్ కూడలి వద్ద ఉన్న వైఎస్ఆర్ విగ్రహానికి జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎంపిపి ఎస్.దాసు, సర్పంచ్ నగిరి ప్రభావతిలు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు.

కంచిలి : రైల్వే స్టేషన్ సమీపంలోని వైఎస్ఆర్ విగ్రహానికి జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ, జెడ్‌పిటిసి ఇప్పిలి లోలాక్షి, ఎంపిపి దేవదాస్‌రెడ్డి, వజ్జ మృత్యుంజయం, యారడి ఆనందరావు, సింహాచలం, లడ్డు కేశవపాత్రో, డొక్కారి బలరాంలు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు.

పాతపట్నం : స్థానికంగా ఉన్న వైఎస్ఆర్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. అనంతరం స్థానిక ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు పళ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపిపి డి. సావిత్రి, వైస్‌ఎంపిపి ఎస్.ప్రదీప్, అర్జునరావు పాల్గొన్నారు.

పలాస : కాశీబుగ్గ సంత మైదానం, కిడ్నీ ఆస్పత్రి వద్ద వైఎస్ఆర్ విగ్రహాలకు మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ మీసాల సురేష్‌బాబు, ఎంపిపి ప్రతినిధి ఉంగ సాయికృష్ణ, పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు పైల వెంకటరావు చిట్టి, మాజీ ఎంపిపి బత్తిన హేమేశ్వరరావు, మొదలవలస మన్మథరావు, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు కొర్ల సంతోష్, దువ్వాడ రవికుమార్, చింతాడ మాధవరావు, కొర్ల మురళీకృష్ణచౌదరి, రోణంకి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పోలాకి: మండలంలోని ఈదులవలస, పిన్నింటిపేట, సుసరాం, గాతలవలస గ్రామాల్లోని వైఎస్ఆర్ విగ్రహాలకు వైసిపి జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. అలాగే ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు, వికలాంగులకు పళ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి ధర్మాన కృష్ణచైతన్య, డిసిసిబి మాజీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, ఎంపిపి ప్రతినిధి ముద్దాడ బైరాగినాయుడు, వైసిపి మండల కన్వీనర్ కణితి కృష్ణారావు పాల్గొన్నారు.

మెళియాపుట్టి : మెళియాపుట్టిలోని వైఎస్ఆర్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. అనంతరం స్థానిక ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు పళ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి బి.ఉదయ్‌కుమార్, వైస్ ఎంపిపి ఎస్.ఆదినాయుడు, పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు బాలరాజు, కరణం శశి పాల్గొన్నారు.

సంతబొమ్మాళి : సంతబొమ్మాళిలోని వైఎస్ఆర్ విగ్రహానికి పిఎసిఎస్ మాజీ చైర్మన్ కెల్లి జగన్నాయకులు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు పొందల రామకృష్ణ, నక్క భీమారావు, కోత సతీష్, పాల మహేష్, నక్కెట్ల నరేష్, వాదాల దుర్గారావు కళింగపట్నం నాగరాజు, రెయ్యి ఆనంద్, వాసు పాల్గొన్నారు.

మందస : మండలంలోని బెతాలపురంలో ఉన్న వైఎస్ఆర్ విగ్రహానికి డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యానవన యూనివర్సిటీ బోర్డు మెంబరు బత్తిని లక్ష్మణ్, వైసిపి నాయకులు టి.దామోదర్, గుంటు లింగరాజులు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో మడియా రుషి, కె.మోహనరావు, పల్లెటి రూపారావు, కోడ శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

టెక్కలి రూరల్ : స్థానిక ఇందిరాగాంధీ కూడలి వద్ద ఉన్న వైఎస్ఆర్ విగ్రహానికి ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో వైసిపి జిల్లా మహిళా అధ్యక్షులు చింతాడ మంజు, ప్రతినిధి గణపతి, మండల పార్టీ అధ్యక్షులు కిల్లి అజయ్‌కుమార్ కోత సతీష్ పాల్గొన్నారు.

అలాగే వైఎస్ఆర్ విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు పొట్నూరు ఆనంద్, దాట్ల లింగమూర్తి, సూరకుమారి, కోట రమణ, విశ్వనాథం, గోరింట కృష్ణ, జోగి రమేష్, సతీష్, అప్పన్న, సుబ్బారావులు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. అనంతరం కార్మికులకు టవళ్లు పంపిణీ చేశారు.

వజ్రపుకొత్తూరు : మండలంలోని అక్కుపల్లిలోని వైఎస్ఆర్ విగ్రహానికి వైసిపి సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షులు ఉప్పరపల్లి ఉదయ్‌కుమార్ పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు గూడ ఈశ్వరరావు, జోగ అప్పారావు, బత్తిన లక్ష్మీనారాయణ, డి.విద్యాసాగర్, వేంపల్లి యోగి, జోగారావు, దానేసు, దున్న రమేష్ పాల్గొన్నారు.

కొత్తూరు : స్థానిక రెల్లివీధిలోని వైఎస్ఆర్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా కేక్‌ను కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. అనంతరం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు పళ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి కె.భాగ్యవతి, ఎంపిపి సవర సావిత్రి, గోగుల వరప్రసాదరావు నాయుడు, పిన్నింటి రామారావు, నాయుడు, టి. రమణారావు, సిహెచ్.భాస్కరరావు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఎదురుగా ఉన్న వైఎస్ఆర్ విగ్రహానికి ఎంపిపి రోణంకి ఉమామల్లేశ్వరరావు, జెడ్‌పిటిసి దుబ్బ వెంకటరావులు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి దుక్క రోజా, ప్రతినిధి రామకృష్ణ, అన్నెపు రామారావు, సంపతిరావు హేమసుందరరాజు, పేడాడ వెంకటరావు, కాళ్ల సంజీవరావు పాల్గొన్నారు.

నౌపడ : సంతబొమ్మాళి మండలం నౌపడలోని వైఎస్ఆర్ విగ్రహానికి వైసిపి నాయకులు పిలక రవికుమార్‌రెడ్డి, లోపింటి రాములు, మేఘవరం ఎంపిటిసి రాజారావులు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు.

శ్రీకాకుళం అర్బన్ : నివాళ్లర్పిస్తున్న కృష్ణదాస్ తదితరులు

ఆమదాలవలస : వైఎస్ఆర్ విగ్రహానికి నివాళ్లర్పిస్తున్న సీతారాం

రణస్థలం : మాట్లాడుతున్న కిరణ్‌కుమార్

మొక్కలు నాటుతున్న విసి రజని తదితరులు

మొక్కలతోనే మానవ మనుగడ

ఎచ్చెర్ల: పర్యావరణ పరిరక్షణ కోసం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఇటీవల ప్రారంభించిన ఏక్ పేడ్ మా కే నామ్ (తల్లితో కలిసి తల్లిపేరుతో మొక్క నాటుట) కార్యక్రమాన్ని ఒక ఉద్యమంలా చేపట్టాలని డా.బి.ఆర్.అంబేద్కర్ యూనివర్సిటీ వైస్-ఛాన్సలర్ ఆచార్య కె.ఆర్.రజని సూచించారు. 'వర్సిటీ ఎన్ఎస్ఎస్ యూనిట్-7 ఆధ్వర్యంలో సోమవారం క్యాంపస్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో విసి పాల్గొని మొక్కలు నాటారు. ఈ ఉద్యమంలో అందరూ భాగస్వాములు కావాలన్నారు. మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణ బాధ్యతను ఆయా యూనిట్లు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య పి.సుజాత, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డా.ఎం. అనురాధ, హాస్టళ్ల చీఫ్ వార్డెన్ డా.ఎన్.లోకేశ్వరి, పిడి డా.కె.శ్రీనివాసరావు, యూనిట్-7 పిఒ టి. భవాని, అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి జ్యోత్స్న

హెల్మెట్ వినియోగం తప్పనిసరి

పొందూరు: ద్విచక్ర వాహనదారులు హెల్మెట్‌ను తప్పనిసరిగా వినియోగించేలా చర్యలు చేపట్టాలని జూనియర్ సివిల్‌జడ్జి బి.జ్యోత్స్న పోలీసులకు ఆదేశించారు. జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో సోమవారం పోలీసులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రమాదాలను నివారించడంలో హెల్మెట్ ప్రాధాన్యతను ద్విచక్ర వాహనదారులకు తెలియజేసి తప్పనిసరిగా హెల్మెట్ వినియోగించేలా అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సమావేశంలో పొందూరు, జి.సిగడాం మండలాల పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర ఫార్మసీ ఆఫీసర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షులుగా గోపాల్


గోపాల్

పలాస: రాష్ట్ర ఫార్మసీ ఆఫీసర్స్ అసోసియేషన్ ఎన్నికల్లో ఉత్తరాంధ్ర ప్రతినిధిగా రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్‌గా బోనెల గోపాల్ ఎన్నికయ్యారు. గోపాల్ మండలంలోని రెంటికోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఫార్మసీ ఆఫీసర్‌గా పనిచేస్తున్నారు. పలాస నియోజక వర్గంలో గ్రీన్‌ఆర్మీ అసోసియేషన్ అధ్యక్షులుగా, ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాలతో కూడిన ఎపిఎన్‌జిఒ అధ్యక్షుడుగా పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చౌదరి పురుషోత్తం నాయుడు, జిల్లా ఫార్మసీ నాయకులు సోమేశ్వరరావు, చక్రవర్తి, సుబ్ర హ్మణ్యం, మల్లేశ్వరరావు, విజయ మోహన్, గోవింద నాయుడు, నరసింహారావు, తులసి, దుర్గ జిల్లా ఫార్మసీ ఆఫీసర్స్ హర్షం వ్యక్తం చేశారు.

రోడ్డు విస్తరణకు సహకరించాలి

శ్రీకాకుళం అర్బన్: శ్రీకాకుళం-ఆమదాలవలస రోడ్డు విస్తరణలో బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని, ఏ ఒక్కరికి అన్యాయం జరగదని ఎమ్మెల్యే గొండు శంకర్ హామీ ఇచ్చారు. నగర పరిధిలోని బాధితులతో బలగ సమీపంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో అధికారులతో కలిసి సోమవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ రోడ్డు విస్తరణలో భూములు, స్థలాలు కోల్పోవడం బాధా కరమైనప్పటికీ ప్రజల అవసరాల దృష్ట్యా సహకరించాలని కోరారు. తోడ్పాటు అందించిన ప్రతి కుటుంబానికి అన్యాయం జరగకుండా పూర్తి బాధ్యత వహిస్తానన్నారు. బాధితులకు ప్రభుత్వం చెల్లించాల్సిన మొత్తానికి టిడిఆర్ బాండ్ల రూపంలో నష్టపరిహారం చెల్లించడం జరుగుతుందని చెప్పారు. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా ఇదే విధానం కొనసాగుతోందన్నారు. బాధితులు ఎటువంటి అపోహలకు గురికాకుండా అభివృద్ధికి సహకరించాలని కోరారు. సమావేశంలో నగరపాలక సంస్థ కమిషనర్ ఓబులేసు, సుడా, ఆర్‌అండ్‌బి, నగరపాలక సంస్థ అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

డిజిటల్ అసిస్టెంట్లకు ప్రాధాన్యత కల్పించాలి

అభినందిస్తున్న డిజిటల్ అసిస్టెంట్లు

కవిటి: రాబోయే రోజుల్లో జరగనున్న ఉద్యోగుల సర్దుబాటు ప్రక్రియలో సచివాలయం విభాగంలో కీలక బాధ్యతలు నిర్వర్తిస్తున్న డిజిటల్ అసిస్టెంట్లకు ప్రాధాన్యత కల్పించాలని నియోజకవర్గంలోని డిజిటల్ అసిస్టెంట్లు కోరారు. ఈ మేరకు మండలంలోని రామయ్యపుట్టుగలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే అశోక్‌ను సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. అంతకుముందు వరుసగా మూడుసార్లు ఇచ్ఛాపురం నియోజకవర్గం నుంచి విజయం సాధించిన సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేస్తూ... అశోక్‌కు దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో నాలుగు మండలాల డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఎరువులు షాపుల తనిఖీ

మెళియాపుట్టి: స్థానిక శ్రీనివాస ఎరువులు షాపును తాడేపల్లిగూడెం వ్యవసాయ సహాయ సంచాలకులు పి.మురళీకృష్ణ, విజిలెన్స్ డిఎస్‌పి ఎస్.కిరణ్‌కుమార్‌లు సోమవారం తనిఖీ చేశారు. షాపులోని విత్తనాలు, ఎరువులు, పురుగు మందులకు సంబంధించి రికార్డులను, బిల్లులను, గొడౌన్‌లోని స్టాక్ నిల్వలను తనిఖీ చేశారు. అలాగే వెంకటేశ్వర ట్రేడర్స్ షాపులో రూ.1,04,751 విలువైన 1.267 ఎంటిఎస్ ఎరువులను విక్రయాలను నిలుపుదల చేశారు. సంబంధించిన పత్రాలను సమర్పించినంత వరకూ విక్రయించరాదని హెచ్చరించారు. వీరితో జిల్లా నాణ్యత నియంత్రణాధికారి మురళీధర్, ఎఒ ఎస్.దాణకర్దుడు ఉన్నారు.

సోంపేట : ప్రభుత్వం గుర్తించిన అధికృత డీలర్ల వద్ద రైతులు ఎరువులను కొనుగోలు చేయాలని మండల ఎఒ నరసింహమూర్తి సూచించారు. మండలంలోని పలు ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతుల వద్ద నుంచి పాస్‌బుక్ నకళ్లను తీసుకొని, ఎరువులు అమ్మేటప్పుడు రసీదును తప్పక ఇవ్వాలని ఆదేశించారు. అధికృత డీలర్ల వద్ద మాత్రమే రైతులు ఎరువులు కొనుగోలు చేయాలని సూచించారు. నకిలీ విత్తనాలు విక్రయించినా, అధిక ధరలకు విక్రయించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

కార్యకర్తలకు అండగా ఉంటా

మాజీ మంత్రి అప్పలరాజు

పలాస: ప్రతిపక్షంలో ఉన్నామని, అధికార పార్టీ నాయకులు ఇబ్బందులు పెడతారు, కానీ, ఎవరూ భయపడవద్దని, వారికి అండగా ఉంటామని మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు కార్యకర్తలకు భరోసా ఇచ్చారు. కాశీబుగ్గ మాజీ మంత్రి కార్యాలయం సమీపంలో నియోజకవర్గ పరిధిలోని వైసిపి కార్యకర్తలతో, నాయకులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టిడిపి నాయకులు అధికారం ఉందని ఇష్టానుసారంగా ప్రవర్తిస్తున్నారని, వారికి ఎదురుగా నిలబడి పోరాటం చేసేందుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఎవరూ ఓటమి వల్ల అధైర్య పడవద్దని, మనోధైర్యంతో ముందుకు వెళ్లాల్సిన సమయం ఆసన్నమైందని అన్నారు. సిఎం నారా చంద్రబాబు నాయుడు ప్రజలను మోసం చేసే విధంగా హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చారని విమర్శించారు. కార్యక్రమంలో హనుమంతు వెంకటరావు, పాలిన శ్రీనివాసరావు, వైస్ చైర్మన్ మీసాల సురేష్‌బాబు, మాజీ ఎంపిపి బత్తిన హేమేశ్వరరావు, ఎంపిపి ప్రతినిధి ఉంగ సాయికృష్ణ, పిఎసిఎస్ మాజీ పిఎసిఎస్ అధ్యక్షులు వెంకటరావు చిట్టి పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న అప్పలరాజు

దగ్ధమైన షాపు

హరిపురంలో ఎలక్ట్రికల్ షాపు దగ్ధం

ప్రజాశక్తి- మందస

మండలంలోని హరిపురం పంచాయతీ కేంద్రం మెయిన్ రోడ్డుకి ఆనుకుని ఉన్న జగన్నాథపురం సర్పంచ్ పురుషోత్తంకు చెందిన ఎలక్ట్రికల్ షాప్‌ను ఆదివారం అర్ధరాత్రి దగ్ధమైంది. ఈ ప్రమాదంలో విద్యుత్ ఉపకరణాలు కాలిపోయాయి. దుండగలు పెట్రోల్ పోసి నిప్పంటించారని బాధితుడి వాపోతున్నారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది శకటంతో వచ్చి మంటలను అదుపు చేశారు. ఎఎస్ఐ శేఖర్ సంఘటనాస్థలాన్ని పరిశీలించారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.పది లక్షల వరకు ఆస్తినష్టం ఉంటుందని బాధితుడు తెలిపారు.

ఎమ్మెల్సీ 'దువ్వాడ' ఇల్లు పరిశీలన

టెక్కలి : మండలంలోని శ్యాంసుందరాపురం పంచాయతీ అక్కువరం వద్ద నూతనంగా నిర్మించిన ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ ఇంటిని సబ్ కలెక్టర్ నూరుల్ కమర్ సోమవారం పరిశీలించారు. ఎన్నికల కోడ్ అమలు సమయంలో సర్వే నంబరు 282 బై వన్-బి ఉన్న 19 సెంట్ల స్థలంలో శ్రీనివాస్ భవనాన్ని నిర్మించారు. అప్పట్లో నాలా కన్వర్షన్ నిమిత్తం రూ.41,800 చెల్లించారు. అయితే సంబంధిత భవన నిర్మాణంలో నిబంధనలు పాటించడం, నాలా కన్వర్షన్ జరిగిన అనంతరం అనుమతులతో భవనం నిర్మాణం జరిగిందా? లేదా? అనే అంశంపై సంబంధిత రికార్డులను పరిశీలించారు. ఈయనతోపాటు తహశీల్దార్ బాల మురళీకృష్ణ, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

దోమల నియంత్రణకు చర్యలు

పాతపట్నం: దోమల నియంత్రణకు కృషి చేస్తామని పెద్దలక్ష్మీపురం సర్పంచ్ అన్నెపు ఉమామహేశ్వరరావు అన్నారు. ఈ మేరకు వీధుల్లో దోమల నివారణకు సోమవారం ఫాగింగ్ చేయించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షాకాలంలో దోమలు వృద్ధి చెందడంతో జ్వరాలు వ్యాప్తి చెందుతాయని అన్నారు. దోమల నివారణా కోసం దోమల స్ప్రే ఫాగింగ్ చేయించామన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆయన సూచించారు.

చెరువులో పూడికతీత పనులు

పొందూరు: మండలం గోకర్ణపల్లిలో జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ద్వారా నూకమ్మ చెరువులో పూడికతీత పనులను సోమవారం టిడిపి జిల్లా కార్యదర్శి సీపాన శ్రీరంగ నాయకులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పూడికతీత పనులు చేపట్టడం వలన రైతులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో నాయకులు, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

పూడికతీత పనులను ప్రారంభిస్తున్న శ్రీరంగనాయకులు

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

'మిషన్ శక్తి సంకల్ప్' పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో మహిళల అభ్యున్నతికై మిషన్ శక్తి సంకల్ప్, భారతీయ న్యాయ సంహిత కార్యక్రమాలను ప్రకటించడం జరిగిందని, ఈ కార్యక్రమాలపై విస్తృత ప్రచారం నిర్వహించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో ఆయన ఛాంబర్‌లో ఐసిడిఎస్ రూపొందించిన పోస్టర్లను ఆయన విడుదల చేశారు. ఈ ఏడాది 100 రోజుల కార్యాచరణ ప్రణాళిక అక్టోబరు 4 వరకు క్షేత్రస్థాయిలో విస్తృత ప్రచారం నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ పిడి శాంతిశ్రీ, నోడల్ అధికారి మణెమ్మ తదితరులు పాల్గొన్నారు.

శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు

ఇసుక ర్యాంపు ప్రారంభం

ప్రజాశక్తి- కొత్తూరు

మండలంలోని అంగూరు లోని వంశధార నది వద్ద ఉచితంగా ఇసుక రాంపును ఎమ్మెల్యే మామిడి గోవిందరావు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎన్నికల ప్రచారంలో ఉచిత ఇసుకను ఇస్తామని హామీనిచ్చారని గుర్తు చేశారు. హామీలో భాగంగా ప్రతి భవన నిర్మాణ కార్మికుడికీ ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో ఉచితంగా ఇసుకను అందిస్తున్నామని అన్నారు. ప్రతి పేద కుటుంబం ఇళ్లునిర్మించుకునే వెసులుబాటు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి లోతుగెడ్డ తులసీవరప్రసాదరావు, ఎంపిడిఒ త్రివిక్రమరావు, టిడిపి నాయకులు అరుణ్‌కుమార్, దాసునాయుడు, వై.సంతోష్‌కుమార్, ఎ.దశరథ్, వి.సుధాకర్ పాల్గొన్నారు.

పాతపట్నం : మండలంలోని సింగుపురానికి చెందిన డోల చందు బ్రెయిన్ వ్యాధితో బాధపడుతున్నాడు. విషయం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు స్పందించి తక్షణ సాయం కిందరూ.పది వేలు ఆర్థికసాయం అందజేశారు.

పరిశీలిస్తున్న డిఇ మురళీకృష్ణ

నారాయణపురం కాలువ పరిశీలన

ఎచ్చెర్ల: మండలంలోని నారాయణపురం కుడి కాలువను డిఇ మురళీకృష్ణ సోమవారం పరిశీలించారు. కుడి కాలువ ద్వారా చివర గ్రామాలను ఎటువంటి ఆటంకాలు లేకుండా సాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పది కిలోమీటర్ల పొడవు కాలువలె గుర్రపు డెక్క, తూతి తీగలు అల్లుకున్నాయని చెప్పారు. వీటిని తొలగించేందుకు రూ.2 లక్షలు ఖర్చు వఅవుతుందని చెప్పారు. త్వరితగతిన పనులను చేపట్టి ఈ నెల 18 నాటికి సాగునీరు విడుదల చేస్తామని అన్నారు. కార్యక్రమంలో ఎఇ జి.వి.రమణ, కూటమి నాయకులు మల్లేషి, అప్పలరమణ, పైడి అన్నంనాయుడు, రూప రమేష్ పాల్గొన్నారు.

ఫిజియోథెరపీని పరిశీలిస్తున్న గోవిందరావు

కెజిబివి, భవిత కేంద్రం సందర్శన

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

కెజిబివి, భవిత కేంద్రాలను సమగ్ర శిక్షా అభియాన్ జిల్లా ఐఇ కో-ఆర్డినేటర్ బి.గోవిందరావు, ఎఎల్ఎస్ కో-ఆర్డినేటర్ పి.జనార్ధనరావు, ఎంఇఒ-2 ఎల్.వి.ప్రతాప్‌లు సోమవారం సందర్శించారు. కెజిబివిలో డయేరియా వ్యాధితో బాధపడుతున్న విద్యార్థినులను పరామర్శించి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్ఒ లక్ష్మీప్రశాంతిని సూచించారు. భవిత కేంద్రంలో నిర్వహిస్తున్న ఫిజియోథెరపీ సేవలను పర్యవేక్షించారు. జిల్లావ్యాప్తంగా 5,189 మంది ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు లైఫ్ స్కిల్స్, ఫిజియోథెరపీ, హోమ్ బేస్ ఎడ్యుకేషన్ అందిస్తున్నట్లు తెలిపారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లల నమోదులో 1319 మందిని కొత్తగా గుర్తించి పాఠశాలల్లో చేర్పించామన్నారు. ఫిజియోథెరపీ సేవలతో పిల్లల ఆరోగ్యంలో మంచి ఫలితాలు వస్తున్నాయని చెప్పారు. కార్యక్రమంలో ఫిజియోథెరపిస్టు జి.కిరణ్‌కుమార్, ఐఇఆర్‌పిలు దేవమని, శరత్ చంద్రిక పాల్గొన్నారు.

రామస్వామిని సన్మానిస్తున్న సర్పంచ్ గౌరీపతి

అంకితభావంతో పనిచేస్తేనే గుర్తింపు

ఆమదాలవలస : ప్రభుత్వ ఉద్యోగులు తన విధులను సక్రమంగా నిర్వహిస్తే తగిన గుర్తింపు లభిస్తుందని అక్కులపేట సర్పంచ్, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు బొడ్డేపల్లి గౌరీపతి అన్నారు. మండలంలోని అక్కులపేట పంచాయతీలో విధులు నిర్వహిస్తున్న లైన్‌మెన్ మీసాల రామస్వామికి ఉత్తమ లైన్‌మెన్‌గా ఇటీవల ఢిల్లీలో అవార్డు అందుకున్న సందర్భంగా అక్కులపేట గ్రామ పెద్దలంతా సోమవారం సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ రాజధానిలో సిక్కోలు వాసి అవార్డు పొందడం ఎంతో గర్వకారణమన్నారు. విద్యుత్ సమస్యలు పరిష్కారంలో ఉత్తమ సేవలు అందించడం వలనే ఈ అవార్డు వరించిందని తెలిపారు. కార్యక్రమంలో రూరల్ లైన్ ఇన్‌స్పెక్టర్ కె.శ్రీనివాసరావు, ఎంపిటిసి ప్రతినిధి బొడ్డేపల్లి లక్ష్మీనారాయణ, మండల సర్వేయర్ బొడ్డేపల్లి గోపి, బొడ్డేపల్లి చిన్నబాబు, పలువురు లైన్‌మెన్‌లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరి

టెక్కలి : వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పకుండా పాటించాలని జూనియర్ సివిల్ జడ్జి ఎస్.హెచ్.ఆర్.చక్రవర్తి తేజ అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం విద్యార్థులకు అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మారుతున్న చట్టాలపై అవగాహన చేసుకుని తమ అభివృద్ధిని కాంక్షించుకోవాలన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు దివ్వల వివేకానంద, మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ డి.సంజీవిరావు, ఎస్ఐ టి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

మూడేళ్లయినా కదలని పారిశుధ్య వాహనం

ప్రజాశక్తి- సరుబుజ్జిలి

ఎంపిడిఒ కార్యాలయ ఆవరణలో మూలన ఉన్న పారిశుధ్య వాహనం

గత వైసిపి ప్రభుత్వం క్లీన్ ఆంధ్రప్రదేశ్ అనే నినాదంతో ప్రతి మండలానికి పారిశుధ్య వాహనాలను మంజూరు చేసింది. ఈ వాహనాల ద్వారా ఆయా గ్రామ పంచాయతీల్లో ఉన్న తడి, పొడిచెత్తను సేకరించి డంపింగ్ యార్డులకు తరలించడానికి ప్రభుత్వం దృఢ సంకల్పంతో స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా ఈ వాహనాలను మంజూరు చేశారు. అయితే మండలానికి మంజూరు చేసిన రెండు వాహనాలు ఎటువంటి వినియోగానికి నోచుకోకుండా పూర్తి నిర్లక్ష్యానికి గురై లక్షల రూపాయలు విలువ చేసే వాహనాలు తుప్పు పట్టి మట్టిలో కలిసి పోతున్నాయి. ఒక వాహనాన్ని మండలంలో అతిపెద్ద గ్రామ పంచాయతీ అయిన పురుషోత్తపురంకు కేటాయించగా కొద్దిరోజులు మాత్రమే వినియోగించిన గ్రామ పంచాయతీ అధికారులు తరువాత దానిని పట్టించుకోక పోవడంతో ప్రస్తుతం ఆ గ్రామంలో ఒక మూలకు చేరింది. రెండో వాహనం సరుబుజ్జిలి గ్రామ పంచాయతీకి కేటాయించగా ఈ పారిశుధ్య వాహన డ్రైవర్ ఎంపిక విషయంలో వైసిపికి చెందిన ఇరువర్గాల మధ్య అభిప్రాయ బేధాలు రావడంతో ఎటు నిర్ణయించలేని అధికారులు స్థానిక ఎంపిడిఒ కార్యాలయ ఆవరణలో 2021 నుంచి ఓ మూలన నిలిపివేశారు. ప్రస్తుతం ఈ వాహనం చెట్ల కింద ఉండడంతో పలుమార్లు చెట్టు కొమ్మలు పడడంతో పాటు ఎండ, వర్షంలో తడుస్తూ తుప్పుపట్టి మూలకు చేరింది. ప్రస్తుతం జిల్లాలో పారిశుధ్య వారోత్సవాల పేరుతో గ్రామ పంచాయతీల ద్వారా పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహిస్తున్న పంచాయతీ అధికారులు లక్షల రూపాయల విలువచేసే ఇటువంటి పారిశుధ్య వాహనాల పనితీరుపై కనీసం పట్టించుకోకపోవడంపై మండల ప్రజలు తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నారు. తక్షణమే దీనిపై పాలకులు చర్యలు తీసుకొని వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు.

కవిటి : పుష్పగుచ్ఛం అందజేస్తున్న టిడిపి నాయకులు

కేంద్రమంత్రికి అభినందనలు

కవిటి: కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడును మండల టిడిపి నాయకులు సోమవారం కలిసి అభినందనలు తెలిపారు. అనతి కాలంలోనే కేంద్రమంత్రి పదవి చేపట్టడంపై హర్షం వ్యక్తం చేశారు. అనంతరం దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో మణిచంద్రప్రకాష్, సంతోష్ పట్నాయక్, రంగారౌలో, భీమా రౌలో పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్ : వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్న ఎంఎల్‌హెచ్‌పిల సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని సంఘం ప్రతినిధులు కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడును కోరారు. సోమవారం ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రధానంగా 23 శాతం వేతనాలు పెంచాలని, వార్షిక ఇంక్రిమెంట్ పాలసీ, సర్వీసు రెగ్యులరైజేషన్, ఇన్సెంటివ్స్ బకాయిలు, అద్దెలు, కరెంటు బిల్లు బకాయిలు చెలించాలని కోరారు. మంత్రిని కలసిన వారిలో ఎపి ఎంసిఎ అధ్యక్షులు నిరంజన్, జాయింట్ సెక్రటరీ ఉషారాణి తదితరులున్నారు.

ఎంఎల్‌హెచ్‌పిలు సత్కారం

జిల్లా కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ హెల్త్‌కేర్ ప్రొవైడర్స్ (పిఎంపి) ఆధ్వర్యాన రామ్మోహన్ నాయుడును ఆయన క్యాంపు కార్యాలయంలో సంఘం నాయకులు కలిసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛాన్ని అందజేసి శాలువ కప్పి సత్కరించారు. సంఘం జిల్లా అధ్యక్షులు వండాన శిమ్మన్న సెక్రెటరీ నక్క లక్ష్మీనారాయణ, ట్రెజరర్ కె.జనార్ధనరావు, జాయింట్ సెక్రెటరీ సిహెచ్ రాము, సభ్యులు డోల వాసు, మడ్డి అప్పల రాజు, ఐ.మోహనరావు పాల్గొన్నారు.

మెళకువలతో కూడిన బోధన అవసరం

ప్రజాశక్తి- టెక్కలి

వినతిపత్రం అందజేస్తున్న హెచ్‌ఎం శోభారాణి

విద్యార్థులకు ఉపాధ్యాయులు మెళకువలతో కూడిన చదువును బోధించాలని విద్యాశాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ సిహెచ్.విజయభాస్కర్ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో నిర్వహించిన టీచ్ టు లెర్న్ శిక్షణా శిబిరాన్ని సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తరగతి గదిలో పాఠ్యాంశాలు బోధించే ఉపాధ్యాయుడు విద్యార్థి సర్వతోముఖాభివృద్ధి సాధించాలంటే పుస్తకాలను చదించాలన్నారు. బోధనలో ఒకే పద్ధతి కాకుండా వివిధ రూపాల్లో బోధించాలన్నారు. ప్రధానోపాధ్యాయులు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. ఎప్పటికప్పుడు విద్యార్థి స్థాయిని అంచనా వేస్తుండాలని సూచించారు. సమావేశంలో టెక్కలి డివిజన్ ఉపవిద్యాశాఖాధికారి విలియమ్స్, ఎంఇఒ దల్లి తులసీరావురెడ్డి, డివిజన్‌లోని ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

ల్యాబ్ సౌకర్యం కల్పించాలి

ల్యాబ్ సౌకర్యం ఏర్పాటు చేయాలని విద్యార్థినులు ఆర్‌జెడిని కోరారు. ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థినులకు ఏక రూపదుస్తులతో పాటు మధ్యాహ్న భోజన సౌకర్యం కల్పించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. దీనిపై ఆయన స్పందిస్తూ.. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శోభారాణి, కళాశాల అధ్యాపకులు తమ్మినేని ఆనందరావు, కూన వెంకటరమణ పాల్గొన్నారు.

పరామర్శిస్తున్న ఎమ్మెల్యే అశోక్

ఎమ్మెల్యే అశోక్ పరామర్శ

సోంపేట : మండలంలోని గొల్లవూరు, బారువకొత్తూరు, గొల్ల గండి, రామయ్యపట్నం తదితర గ్రామాల్లో ఇటీవల పలువురు మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే బెందాళం అశోక్ మృతుల కుటుంబ సభ్యులను సోమవారం పరామర్శించారు. ఈ సందర్భంగా మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఆయనతోపాటు జి.కె.నాయుడు, దున్న సత్యం, రత్నాల బాబూరావు, ఈరోతు చంద్రయ్య, మడ్డు కుమార్, ఈరోతు భాస్కర్ ఉన్నారు.

వికలాంగులకు భరోసా

కవిటి: వికలాంగులకు పింఛను రూ.6 వేలకు పెంచిన కూటమి ప్రభుత్వం వారికి భరోసా కల్పించిందని మల్లారెడ్డి భాస్కరరావు అన్నారు. నియోజకవర్గంలోని వికలాంగులు సోమవారం ఎమ్మెల్యే అశోక్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. తమకు భరోసా కల్పించిన ప్రభుత్వంపై కృతజ్ఞత చూపుతామని హామీ ఇచ్చారు. అదే విధంగా ఎప్పటి నుంచో అపరిష్కృతంగా ఉన్న తమ సమస్యలు పరిష్కరించాలని కోరారు.

పూర్వ విద్యార్థుల సహకారం

మెళియాపుట్టి : మండలంలోని పెద్దలక్ష్మీపురం జిల్లా పరిషత్ పూర్వ విద్యార్థులు పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు సహాయ సహకారాలు అందజేశారు. ప్రోత్సాహక బహుమతులు సోమవారం అందించారు. ఈ ఏడాది పదిలో చింతాడ కీర్తి, శాంతిప్రియ, వినోద్, మేఘనలకు మెమొంటో, స్కూల్ బ్యాగు, వాటర్ బాటిళ్లు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎ.వి.రమణ మూర్తి, పూర్వ విద్యార్థులు టంకాల సుందరరావు, బి.దుర్యోధనరావు, బాలకృష్ణ, ఖగేష్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కుమారుడు పరామర్శ

లావేరు : మండలంలోని బొంతుపేటకు విశ్రాంత జాయింట్ కలెక్టర్ రెడ్డి గున్నయ్యను ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్ఇఆర్ కుమారుడు తేజబాబు సోమవారం పరామర్శించారు. గున్నయ్య సోదరుడు రెడ్డి రామసత్యం ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన పరామర్శించారు. పరామర్శించిన వారిలో తాళ్లవలస మాజీ సర్పంచ్ ముప్పుడి మురళీమోహన్, జోగిరాజ మౌళీ, శివకుమార్, ఆదయ్య, రాజేష్ ఉన్నారు.

ఎరువులను పంపిణీ చేస్తున్న టిడిపి నాయకులు

రైతుల అభివృద్ధే ధ్యేయం

బూర్జ: మండలం కొల్లివలస పంచాయతీ పరిధి సచివాలయంలో టిడిపి మండల ఉపాధ్యక్షుడు పిళ్లా కన్నంనాయుడు, సర్పంచ్ గాడి వేణు ఆధ్వర్యంలో ఖరీఫ్‌కు అవసరమైన ఎరువులను రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు మేడి ప్రసాదరావు, నున్నగొప్పల వాసుదేవరావు, సైరిగాపు ఆనందరావు, వ్యవసాయ శాఖ సిబ్బందితో పాటు రైతులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సాగుహక్కు పత్రాలు వినియోగించుకోవాలి

ప్రజాశక్తి- లావేరు

లావేరు : రైతులకు అవగాహన కల్పిస్తున్న విఎఒ ప్రమీల

కౌలు రైతులు పంట సాగుహక్కు పత్రాల ద్వారా బ్యాంక్ రుణాలు తీసుకొని సద్వినియోగం చేసుకోవాలని విఎఎ బగాది ప్రమీల అన్నారు. సోమవారం సచివాలయం-2 లావేటి పాళెంలో కౌలు రైతులకు సిసిఆర్‌సి కార్డులపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కౌలుకు ఇవ్వనున్న భూ యజమానికి రెండున్నర ఎకరాల భూమి ఉండాలన్నారు. కౌలు కార్డు 11 నెలల పాటు చెల్లుబాటు అవుతుందన్నారు. వీటి ద్వారా పంటపై కౌలు రైతులు బ్యాంకుల్లో రుణాలు పొందవచ్చునని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో విఆర్ఒ లక్మణరావు, రైతులు యినపకుర్తి తోటయ్యదొర, గురిజా శ్రీనువాసరావు, లంకలపల్లి నరేష్, ఐవి రమణ పాల్గొన్నారు.

పొందూరు: మండలం తోలాపిలో కార్యదర్శి జనార్ధనరావు ఆధ్వర్యంలో సోమవారం కౌలురైతుల గుర్తింపు గ్రామసభను నిర్వహించారు. ఈ సందర్భంగా కౌలు రైతులకు గుర్తింపు కార్డులను అందజేయడం ద్వారా అర్హత కలిగిన రైతులకు ఎన్నో ప్రయోజనాలు కలుగు తాయన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు పొన్నాడ రామారావు, దుంపల సత్యం, మాజీ ఎంపిటిసి పప్పల అప్పలనాయుడు, పొన్నాడ అప్పన్న, వైస్ సర్పంచ్ శ్రీనివాసరావు, జనసేన ఉపాధ్యక్షుడు పొన్నాడ బాలకృష్ణ, పొన్నాడ సతీష్, విఎఎ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ఒఆర్ఎస్, జింక్ ఆకృతిలో కూర్చున్న విద్యార్థులు

ఒఆర్ఎస్, జింక్‌పై అవగాహన

ప్రజాశక్తి- పోలాకి

ఇంటిగ్రేటెడ్ డయేరియల్ కంట్రోల్ పార్ట్ నైట్‌లో భాగంగా పోలాకి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఒఆర్ఎస్, జింక్‌పై స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ నల్లి రవికుమార్ సోమవారం అవగాహన కల్పించారు. రెండు నెలల పాటు 'డయేరియాను ఆపండి...స్టాప్ డయేరియా'పై అవగాహన కల్పిస్తామని తెలిపారు. విద్యార్థులు ఒఆర్ఎస్, జింక్ ఆకృతిలో కూర్చుని పెట్టి అతిసార వ్యాధి సోకినప్పుడు ఒఆర్ఎస్ వాడే విధానం, జింక్ మాత్రలు 14 రోజులపాటు వాడాల్సిన ఆవశ్యకతను గురించి వివరించారు. అతిసార వ్యాధి సోకిన వ్యక్తులు 14 రోజుల పాటు రోజుకు 20 ఎంజి జింక్ మాత్రలు వాడాలని, ఒఆర్ఎస్ ప్యాకెట్లు సకాలంలో తాగడం ద్వారా నిర్జలీకరణాన్నించి రక్షించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో పర్యవేక్షణ సిబ్బంది మంగం శేఖర్‌బాబు, బరాటం లక్ష్మి, ఉపాధ్యాయులు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

స్వయం సమృద్ధిని పెంపొందించాలి

ప్రజాశక్తి- ఆమదాలవలస

మాట్లాడుతున్న రామారావు

పట్టణ స్వయం సహాయక సంఘాల్లో స్వయం సమద్ధిని పెంపొందించేలా చర్యలు చేపట్టాలని మెప్మా జిల్లా సంస్థాగత బలోపేత సాంకేతిక నిపుణులు బి.రామారావు సూచించారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో జరిగిన పట్టణ, స్లం సమాఖ్యల ఆర్‌పిల నెలవారీ సాధారణ సమీక్షా సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బ్యాంకు రుణాలు, ప్రభుత్వ పథకాల ద్వారా సభ్యులు పొందుతున్న ఆర్థికలబ్ధిని జీవనోపాధి కొరకు మాత్రమే వినియోగించేలా చూడాలన్నారు. సంఘాల, సభ్యుల పరిపుష్టికి ఎప్పటికప్పుడు తగు శిక్షణలు అందించాలని సిబ్బందికి ఆదేశించారు. అన్ని సంఘాల్లో వసూళ్ళ, చెల్లింపుల విషయంలో ఆర్థిక క్రమశిక్షణ పాటించేలా నిరంతర పర్యవేక్షణ చేయాలన్నారు. సంఘాల ఆర్థిక పరిపుష్టికి తగు ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. సమావేశంలో జిల్లా సామాజిక బలోపేత సమన్వయకర్త పి.విజయకుమారి, జీవనోపాధుల సమన్వయకర్త బి.భాస్కరరావు, స్థానిక మెప్మా సిబ్బంది, ఆర్‌పిలు పాల్గొన్నారు.

పూడికతీత పనులకు శంకుస్థాపన

పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్ ధనలక్ష్మి

ప్రజాశక్తి- సంతబొమ్మాళి

మండలంలోని మేఘవరం 29 ఆర్ వంశధార కాలువలో పూడికతీత పనులకు సర్పంచ్ సూరాడ ధనలక్ష్మి సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాలువల్లో యంత్రాల సాయంతో పూడికతీత, గుర్రపుడెక్కలు తొలగిస్తామన్నారు. మరువాడ పంచాయతీ నుంచి లింగూడు టెయిలెండ్ వరకు ప్రతి ఎకరాకూ సాగునీరు అందించేందుకు ఉపయోగపడుతుందని అన్నారు. వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదేశాల మేరకు అధికారులు సాగునీటి కాలువలపై దృష్టిసారించి మరమ్మతులు చేయిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మేరుగు నూకయ్య, ఎంపిటిసి మాజీ సభ్యులు మైలపల్లి శ్రీరాములు, మత్స్యకార నాయకులు సూరాడ ధనరాజు, వార్డు మెంబరు గంట భీమారావు పాల్గొన్నారు.

బంగారం గొలుసును అందజేస్తున్న కండక్టర్ విజయకుమారి

మహిళా కండక్టర్ నిజాయితీ

ప్రజాశక్తి- టెక్కలి

ఓ మహిళా కండక్టర్ రూ.2 లక్షలు విలువైన రెండు తులాల బంగారం గొలుసుని పోగొట్టుకున్న మహిళకు అందజేసి తన నిజాయితీని చాటుకున్నారు. వివరాల్లోకి వెళ్తే... సోమవారం టెక్కలి-పాతపట్నం రూట్‌లో ఆర్‌టిసి బస్సులో రీసు విజయకుమారి కండక్టర్‌గా ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. మధ్యాహ్నం 3 గంటల ట్రిప్‌లో పాతపట్నం వెళ్తున్న సమయంలో తెంబూరు దాటాక ప్రయాణికులకు టిక్కెట్లు ఇస్తున్నారు. ఈ సమయంలో బస్సులో బంగారం గొలుసు దొరికింది. అదే బస్సులో టెక్కలి నుంచి తెంబూరు వరకు ప్రయాణం చేసిన పొట్నూరు రాణి మరిచిపోయింది. ఇంటికి వెళ్లి తన మెడలో గల గొలుసు లేకపోవడంతో వేరే బైక్‌పై పాతపట్నం వెళ్లారు. బస్సులో పోగొట్టుకున్న గొలుసుని వెతుకుతుండగా... కండర్ గమనించి వాకబు చేశారు. ఆమె వద్ద నుంచి ఆధారాలు తీసుకొని బంగారం గొలుసును అప్పగించింది. దీంతో బస్సులోని ప్రయాణికులు కండక్టర్ నిజాయితీని మెచ్చుకొని అభినందించారు.

లక్ష్మణరావు కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న రవికుమార్

లక్ష్మణరావు మృతి టిడిపికి తీరని లోటు

ప్రజాశక్తి- ఆమదాలవలస

టిడిపి నాయకుడు బత్తుల లక్ష్మణరావు (బుజ్జి) మృతి పార్టీకి తీరనిలోటని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. ఆదివారం డయేరియా లక్షణాలతో లక్ష్మణరావు మృతి చెందడంతో సోమవారం మండలంలోని వెదుళ్లవలసలో లక్ష్మణరావు నివాసానికి ఎమ్మెల్యే రవికుమార్ వెళ్లి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. లక్ష్మణరావు మృతికి గల కారణాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. పార్టీ ఎల్లప్పుడూ కుటుంబానికి అండగా ఉంటుందన్నారు. ఆయనతో పాటు టిడిపి పట్టణ అధ్యక్షులు సంపదరావు మురళి, మాజీ ఎంపిటిసి వండాన ఉదయ్ కుమార్, మాజీ సర్పంచ్ బాలా లక్ష్మణరావు ఉన్నారు.

అవగాహన కల్పిస్తున్న నీలవేణి

మహిళా చట్టాలపై అవగాహన

ఇచ్ఛాపురం : మహిళా సంఘాలపై అవగాహన పెంచుకోవాలని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ నీలవేణి అన్నారు. మండలంలోని మండపల్లి తోటవీధిలో మహిళలకు సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళలకు రక్షణగా నిలిచే అనేక చట్టాలు ఉన్నాయని అన్నారు. ఎవరికైనా, ఎప్పుడైనా లైంగిక వేదింపులకు గురైతే పోలీసులకు ఫిర్యాదు చేయాలని, వారికి చట్టాలు రక్షణగా నిలుస్తాయని తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు బర్రి నరసమ్మ, కె.సునీత, ఎం.లలిత, జి.జ్యోతి, ఇ.జ్యోతి పాల్గొన్నారు.

చదువే ముద్దు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ప్రతి విద్యార్థీ చక్కగా చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని చైల్డ్ హెల్ప్‌లైన్ జిల్లా కో-ఆర్డినేటర్ కె.శివాజీ అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బాల్య వివాహాలు, చైల్డ్ ట్రాఫికింగ్‌పై సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అత్యవసర సమయాల్లో, బాలలకు ఎటువంటి సందేహాలు, సమస్యలు ఉన్నా వెంటనే 1098కి తెలియజేయాలన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు నిరంతరం అండగా ఉంటారని ఉంటారని అన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎన్.విశ్వనాథం, కె.కుర్మయ్య, ఎం.సూర్యం, ఎన్.జోగేష్, వి.శారద పాల్గొన్నారు.

పుష్పగుచ్ఛం అందజేస్తున్న నారాయణరావు

ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు

నందిగాం: రాజాం ఎమ్మెల్యే కొండ్రు మురళీమోహన్ విశాఖలోని ఆయన స్వగృహంలో ఎపి దళిత మహాసభ జిల్లాశాఖ అధ్యక్షులు బోకర నారాయణరావు సోమవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మురళీమోహన్ మంత్రిగా ఎనలేని సేవలు అందించారని అన్నారు. నీతికి, నిజాయితీకి కట్టుబడి పని చేశారని పేర్కొన్నారు. రాజకీయాల్లో మచ్చలేని వ్యక్తిగా గుర్తింపు పొందారని అన్నారు. అందుకు కొండ్రుకు మంత్రి పదవి ఇవ్వాలని సిఎం చంద్రబాబును కోరారు. ఈయనతో పాటు జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి చింతాడ శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

పర్లాకిమిడి : గజపతి జిల్లా కాశీనగర్ పెట్రోల్ బంకు వద్ద బైక్‌ను వ్యాన్ ఢీకొనడంతో రాయగడ మండలం సమితిగండాహతికు యువకుడు గాయపడ్డాడు. సమీపంలో ఖురిగాంకు అగ్నిమాపక సిబ్బంది కాశీనగర్ సమూహ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ ప్రథమ చికిత్స నిర్వహించి పర్లాకిమిడి జిల్లా ఆస్పత్రికి తరలించారు. కాశీనగర్ ఐఐసి సునీల్‌కుమార్ బెహరా కేసు దర్యాప్తు చేస్తున్నారు. క్షతగాత్రుని వివరాలు తెలియాల్సి ఉంది.

చికిత్స పొందుతున్న యువకుడు